



అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి: కలెక్టర్

కూడేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చదివిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. కూడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. సైబర్ నేరాలు, డ్రగ్స్, సెల్ ఫోన్లు పిల్లలపై దుష్ప్రభావం చూపుతున్నాయని, తల్లి దండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఖాళీ సమయాలలో సెల్‌ఫోన్‌లకు బదులుగా పుస్తకాలు చదవాలని, వ్యాయమం, క్రీడలు, డ్రాయింగ్, పాటలు పాడటం, నృత్యాలు చేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా ఉండాలని, వారి సమస్యలను తెలుసుకుని వారికి బంగారు భవిష్యత్తును అందించాలని అన్నారు. కూడేరు సమీపంలోని నిర్మానుష్య ప్రదేశాల్లో అసాంఘిక శక్తులు జయపురం విద్యార్థులను వేధిస్తున్నాయని తలిదండ్రులు కలెక్టర్‌కు తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన సీఐ రాజును ఆదేశించారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తల్లిదండ్రులు కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రాము, తహసీల్దారు మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, ఎంఈఓ సాయికృష్ణ, హెచ్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.



డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం : ఎస్పీ

అనంతపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని ఎస్పీ జగదీష్ అన్నారు. కురుగుంటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో జరిగిన పీటీఎంలో పాల్గొని మాట్లాడారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమం గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. యువత గంజాయికి అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటోందని అన్నారు. గంజాయిని కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ పేరుతో యాంటీ డ్రగ్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రతి జిల్లాలో ఈ టాస్క్ ఫోర్స్ విభాగం ఉంటుందని అన్నారు. ఎక్కడైనా గంజాయిసాగు, అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం కనిపిస్తే టోల్ ఫ్రీ నంబరు 1972కు సమాచారం ఇవ్వాలని కోరారు. సెల్ ఫోన్ చేతిలో ఉందని దుర్వినియోగం చేయొద్దని సూచించారు. మంచికి మాత్రమే వినియోగించాలని అన్నారు. రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు, టీడీపీ నాయకుడు నారాయణస్వామి పాల్గొన్నారు.



రాజేంద్ర స్కూల్‌లో హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు

అక్షరాల సంక్రాంతి

ఆహ్లాదకర వాతావరణంలో మెగా పీటీఎం

- తల్లిదండ్రులు, నాయకులు, అధికారుల రాకతో సందడి
- ఆటపాటలతో అలరించిన చిన్నారులు..
- గురువులలో ఆనందం
- విరాళాలను సమర్పించిన దాతలు..
- 1738 పాఠశాలల్లో వేడుకలు

విద్యార్థులు, ఉపాధ్యాయులు మాత్రమే రోజూ కనిపించే బడిలో కొత్తగా తల్లిదండ్రులు కూడా కనిపించారు. మెగా పీటీఎం పండుగలో సందడి చేశారు. పచ్చటి తోరణాలు, రంగు రంగుల రంగవల్లికలతో సరస్వతీ నిలయాలు మెరిసిపోయాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు, దాతలు వేడుకలలో భాగమయ్యారు. ఆట పాటలు, సహపంక్తి భోజనాలతో శనివారం సందడిగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్.. సంక్రాంతిని ఒక నెల ముందుగానే తీసుకువచ్చింది. కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఉరవకొండ నియోజవకర్గంలోని కూడేరు హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో పాల్గొన్నారు. జేసీ శివ నారాయణ శర్మ అనంతపురం నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు తమ పరిధిలో జరిగిన వేడుకలలో భాగస్వాములయ్యారు. కలెక్టర్ కంట్రోల్ రూం నుంచి డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షించారు. జిల్లాలోని 1738 పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణంలో పీటీఎం నిర్వహించామని డీఈఓ తెలిపారు. (వివరాలు 6లో)



సంతోషం.. సగం బలం..



బడి ముంగిట.. ముత్యాల ముగ్గులు



జోరుగ లాగు.. ఐస్సా..



రోజూ ఇలాగే వచ్చి తినిపిస్తావా అమ్మా..?

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: డీపీఓ

స్వర్ణపంచాయతీ పోర్టల్‌లో వివరాల నమోదుపై సమీక్ష

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాల్సిన వివరాలకు సంబంధించి నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీఓ నాగరాజనాయుడు హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయం లో నుంచి పలువురు ఈఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఆయన జూమ్ మీట్ నిర్వహించారు. నమోదు విషయంలో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నమోదు చేయాల్సిన వివరాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 93 శాతం పూర్తి చేయగలిగినట్లు వెల్లడించారు. పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో వెంటనే పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని 33 పంచాయతీల్లో నమోదు ప్రక్రియ కొంత వరకు పెండింగ్ ఉన్నట్లు ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిస్సింగ్ సిటిజన్స్ వివరాలు కూడా సేకరించాల్సి ఉంటుందన్నారు.

కణేకల్లులో వరి కొనుగోలు కేంద్రం

పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

కణేకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): త్వరలో మండలకేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ వసంతబాబుల ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదువేల మెట్రిక్ టన్నులు వరిధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కణేకల్లు మండలంలో పాటు బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో కూడా వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 2300 సాధారణ రకానికి, రూ. 2320 ఏ గ్రేడ్ రకానికి నిర్ణయించినట్లు వారు తెలిపారు. తేమశాతం 17 ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోనెసంచులు, హమాలీ ఖర్చులు, తూకాల ఖర్చులు కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డీసీఓ అరుణకుమారి, తహసీల్దార్ ఫణికుమార్, ఏఓ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే సీజ్..!

- అగ్రిగోల్డ్ భూముల్లో వైసీపీ నాయకుడి పాగా
- వంద ఎకరాలు సాగు చేసుకుంటున్న వైనం
- అందులోని గోడౌన్ లీజుకు ఇస్తూ లబ్ధి
- నాలుగేళ్లుగా ఇదే తంతు..
- పట్టించుకోని అధికారులు



లీజుకు ఇచ్చిన గోడౌన్

పుట్లూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన అగ్రిగోల్డ్ భూములను ఓ వైసీపీ నాయకుడు నాలుగేళ్లుగా నిర్భయంగా సాగు చేసుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆయన్ను అడ్డుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్రిగోల్డ్ భూములను సాగుచేయడమే కాకుండా ఆ సంస్థకు చెందిన గోడౌన్‌ను ఇతరులకు లీజుకు ఇచ్చాడు. వచ్చిన సొమ్ముతో ఎంజాయ్ చేస్తున్నాడు. వైసీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆ సంస్థకు చెందిన భూములను సీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ వైసీపీ నాయకుడు మాత్రం ఆ భూములనే సాగుచేసుకుంటూ తాను ఆర్థికంగా లబ్ధి పొందుతున్నాడు. మండలంలోని కడవకల్లు, చెర్లోపల్లి గ్రామాల మధ్యన తిమ్మంపల్లి- తాడిపత్రి ప్రధాన రహదారికి పక్కనే అగ్రిగోల్డ్ భూములు 250 ఎకరాలు ఉన్నాయి. వీటిని సుమారు 30ఏళ్ల కిందట కడవకల్లు, చెర్లోపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతుల నుంచి అగ్రిగోల్డ్ సంస్థ పేరిట నిర్వాహకులు కొనుగోలు చేశారు. ఆ భూమికి రక్షణగా కంచెను ఏర్పాటు చేశారు. అయితే ఆ ఇనుప కంచెను కూడా పూర్తిగా తొలగించి గుజీరికి విక్రయించి సొమ్ము చేసుకున్నాడన్న ఆరోపణలు వైసీపీ నాయకుడిపై ఉన్నాయి. గతంలో ఈ భూముల్లో ఉసిరి, మామిడి, చింత తదితర ఉద్యాన పంటలు సాగుచేసేవారు. వాటిలో పండిన పండ్లను కోసి ఊరగాయలు అక్కడే తయారు చేసేవారు. మరికొన్ని పంటలు పండించి కంపెనీ తరపున ట్రాన్స్‌పోర్టు చేస్తుండేవారు. ఈ భూముల్లో వ్యవసాయానికి ఉపయోగపడే యంత్రాలు, పనిముట్లు సైతం ఉన్నాయి. కానీ ప్రస్తుతం అక్కడ ఏమి కనిపించడం లేదు. సీజ్‌చేసిన అనంతరం గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారంటూ గ్రామస్థులు చెబుతున్నారు.



గోడౌన్‌లో నిల్వ చేసుకున్న మొక్కజొన్న బస్తాలు

వ్యవసాయ యంత్రాలు, పరికరాలు మాయం

అప్పట్లో అగ్రిగోల్డ్‌లో ఊరగాయల ఉత్పత్తులు ప్రారంభం కావడంతో వాటికి కావాల్సిన సామగ్రిని, యంత్రాలను కొనుగోలు చేశారు. ఇప్పుడు అవి ఎక్కడా కనిపించడం లేదు. భూములను దున్నడానికి తెచ్చిన రెండు ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో వ్యవసాయ మోటార్లు, వందలాది పైపులు, వేలమీటర్ల డ్రిప్పు పరికరాలు మాయమైనట్లు తెలుస్తోంది. సీజ్ చేయడానిక ముందే కొందరు వ్యక్తులు వీటిని ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఎవరు ఎత్తుకెళ్లారో కూడా తెలియడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. లక్షలాది రూపాయలు విలువ చేసే వస్తువులు ఎత్తుకెళ్లినా పట్టించుకొనే నాథుడే కరువయ్యారన్న విమర్శలు ఉన్నాయి.

సుమారు వంద ఎకరాల్లో సాగు

250 ఎకరాల్లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఆ నాయకుడు సుమారు వంద ఎకరాల్లోపు పంటలు సాగు చేసుకుంటున్నట్లు సమాచారం. వాటిలో మొక్కజొన్న, అరటి, జొన్న తదితర పంటలు సాగుచేసుకుంటూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ భూముల్లో సుమారు పది వ్యవసాయ బోర్లు ఉన్నాయి. నీరు పుష్కలంగా ఉండటంతో పంట దిగుబడి కూడా ఆశించిన స్థాయిలోనే వస్తోంది. ప్రతి ఏటా అరటి, మొక్కజొన్న ఎక్కువగా సాగు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఇలా నాలుగేళ్లపాటు సాగుచేసుకుంటూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ నాయకుడు చేస్తున్న సాగు భూముల్లో అగ్రిగోల్డ్ పరికరాలే ఉన్నట్లు సమాచారం. మిగిలిన భూమిని సాగు చేయకపోవడంతో పెద్దపెద్ద కంపచెట్లు ఏపుగా పెరిగాయి.

గోడౌన్‌ను లీజుకు ...

అగ్రిగోల్డ్‌లో పండిన పంటలను నూర్పిడి చేసి ఆరబెట్టి నిల్వ చేసుకొనేందుకు అప్పట్లో లక్షల రూపాయలు వెచ్చించి పెద్ద గోడౌన్‌ను నిర్మించారు. ప్రస్తుతం దాన్ని ఆ వైసీపీ నాయకుడు యల్లనూరు మండలం తిమ్మంపల్లికి చెందిన ఓ వ్యక్తికి సుమారు రూ.10వేల కు లీజుకు ఇచ్చినట్లు సమాచారం. ఆ గోడౌన్‌లో ఆ వ్యక్తి మొక్కజొన్నలు నిల్వ చేసుకుంటున్నాడు. ఇలా పలుమార్లు పలువురు వ్యక్తులకు వివిధరకాల ధాన్యం నిల్వకు లీజుకు ఇస్తున్నట్లు తెలిసింది.



భూముల్లో మొక్కజొన్న సాగు

అధికారులకు తెలిసే జరుగుతోందా ?

అగ్రిగోల్డ్ భూములను అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో సీజ్ చేసిన సంగతి తెలిసిందే. రెవెన్యూ అధికారులు స్వయంగా వెళ్లి భవంతులు, గోడౌన్, ప్రధాన రహదారి గేటుకి తాళాలు వేసి సీజ్ చేశారు. అయినా అవన్నీ తొలగించి ఎంచక్కా భూముల్లో వ్యవసాయం చేస్తున్నాడు. ఈ తతంగం అధికారులకు తెలిసిందా? లేక తెలియనట్లు ఉన్నారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే అధికారులకు ఈ విషయం తెలిసే జరుగు తోందనే ఆరోపణలు మాత్రం బలంగా వినిపిస్తున్నాయి. మండల కేంద్రానికి 14కిలోమీటర్ల దూరంలో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో ఇంత జరుగుతున్నా అధికారులకు కనిపించక పోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

మా దృష్టికి రాలేదు: శేషారెడ్డి, తహసీల్దార్

సీజ్‌చేసిన అగ్రిగోల్డ్ భూముల్లో సాగు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అలాంటిది ఏమైనా ఉంటే విచారించి చర్యలు తీసుకుంటాం. దీనిపై ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. సీజ్‌చేసిన వాటిలో ఎలాంటి పనులు చేయకూడదు.





నగరంలో స్వామివారి ఊరేగింపు దృశ్యాలు



సుబ్రహ్మణ్యుడి వేడుక

అనంతపురం రూరల్/ఆత్మకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలకు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గ్రామంలో పాలకావడి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈఓ బాబు, ప్రధాన అర్చకులు రాము స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతపురం రూరల్ మండలంలోని పాపంపేటలో స్వామివారి పాలకావడి ఉత్సవం నిర్వహించారు. స్వామి మాలాధారులు వేడుకలలో పాల్గొన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి కృపాకటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు.

అగమ్యగోచరంగా రైతుల పరిస్థితి

13న కలెక్టరేట్‌కు ర్యాలీ

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. రైతుల సమస్యలపై ఈ నెల 13న కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ రంగయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. పండిన కొద్దిపాటి పంటలకు కూడా గిట్టుబాటు ధర అందడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి ఇతరత్ర పంటలకు మద్దతు ధర ప్రకటించినా అందుకు అనుగుణంగా అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. గత ఏడాది వరి ధాన్యం క్వింటాల్ ధర రూ.2700నుంచి రూ.2800 వరకు ఉంటే ఇప్పుడు రూ.1700వరకు మాత్రమే పలుకుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రైతాంగం తరఫున వైసీపీ అధినేత జగన్ కార్యాచరణ ప్రకటించారన్నారు. ఈ నెల 13న ఉదయం 10గంటలకు జడ్పీ కార్యాలయం వద్ద ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి, రైతుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైసీపీ సమన్వయకర్తలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులను భాగస్వామ్యం చేసుకుని తరలిరావాలన్నారు.

చరిత్రలో జరగని వేడుక: పరిటాల సునీత



ప్రతిజ్ఞ చేయిస్తున్న పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఇలాంటి సమావేశాలు జరగలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. తాను కుంటిమద్ది పాఠశాలలో ఏడో తరగతి పరీక్షలు రాశానని, నాటి పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు చదవలేకపోయానని గుర్తు చేసుకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధికి ఎన్నో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తనవంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించారు. హెచ్ఎం అనంత పద్మనాభులు, ఎంఈఓ శ్రీనివాసులు, ఎస్ఐ సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు రంగయ్య, రామ్మూర్తినాయుడు, సుధాకర్, మారుతీప్రసాద్, అశోక్‌కుమార్, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా అభివృద్ధి : కాలవ

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ



కణేకల్లు/రాయదుర్గం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను దేశం గర్వించేలా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. కణేకల్లు క్రాసింగ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, రాయదుర్గం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను ఏ స్థాయిలో ఉన్నాయో తల్లి దండ్రులు నేరుగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకునేందుకు ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయని అన్నారు. బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలు ఉన్నతస్థాయిలో ఎదిగేందుకు నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గురుకుల పాఠశాలలను ప్రారంభించారని అన్నారు. వీటిలో చదివిన ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అయ్యారని అన్నారు. రాయదుర్గం నియోజకవర్గానికి ఒక ట్రిపుల్ ఐటీ కళాశాలను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనాయుడు, ఛైర్మన్ రుద్రప్ప, ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్, నాగమణి, టీడీపీ పట్టణ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు, సీఆర్‌పీలు రాజేష్, లక్ష్మీకాంత్, టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, హనుమంతరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో

మెగా పీటీఎం

తల్లిదండ్రులు, నాయకులు, అధికారుల రాకతో సందడి

ఆటపాటలతో అలరించిన చిన్నారులు

గురువులలో ఆనందం

విరాళాలను సమర్పించిన దాతలు..

ఉమ్మడి జిల్లాలోని 3799 పాఠశాలల్లో వేడుకలు



అక్షరాల సంక్రాంతి

బడి వరకూ మాత్రమే వచ్చే అమ్మ, నాన్న ఈసారి బడిలోకి వచ్చారు. 'ఎలా చదువుతున్నారు' అని గురువులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, నాయకులు, గురువులు చెప్పింది విన్నారు. ఆటపాటల్లో పాల్గొన్నారు. బహుమతులను అందుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3799 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో జరిగిన సంబరం ఇది. మునుపెన్నడూ లేని విధంగా.. సంక్రాంతి సంబరాలను తలపించేలా.. సరస్వతీమాత పులకించేలా జరిగిన వేడుక.



అనంతపురం నగరంలోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో..

భవిష్యత్తుకు బాటలు వేయండి: శ్రావణి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

బుక్కరాయసముద్రం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు బాటలు వేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. సిద్దరాంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చామని అన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రత్యేక అధికారి శ్రీదేవి, ఎంపీపీ సునీత, టీడీపీ నాయకులు శ్రీరామిరెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

అప్పుడప్పుడు బడికి రండి: జేసీ



మాట్లాడుతున్న జేసీ శివ నారాయణ శర్మ

అనంతపురం విద్య/రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు అప్పుడప్పుడు పాఠశాలలకు రావాలని, తమ పిల్లల ప్రగతి గురించి తెలుసుకోవాలని జేసీ శివనారాయణ శర్మ సూచించారు. అనంతపురం నగరంలోని రాజేంద్రమున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పైకి వచ్చానని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల సహా అన్నీ ఉచితంగా అందిస్తోందని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్డీఓ కేశవనాయుడు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మారాలి: దగ్గుపాటి



విద్యార్థులు బాగుపడాలనే ఉపాధ్యాయులు దండిస్తారని, వారిపై తల్లిదండ్రులు దండెత్తడం సరికాదని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. తపోవనం జడ్పీ ఉన్నత పాఠశాల, రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకుని మారాలని సూచించారు. దేశంలోనే మొట్టమొదటి సారి మెగా పీటీఎం నిర్వహిస్తున్నామని, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. పూర్వ విద్యార్థులను ఏకం చేసి పాఠశాలల అభివృద్ధికి నిధులు సేకరించాలని హెచ్ఎంలకు సూచించారు. గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ అధ్వాన్నంగా మారిందని, పాఠశాల స్థాయిలోనే గంజాయికి అలవాటు పడే దారుణమైన పరిస్థితులు చూశామని ఆవేదన వ్యక్తం చేశారు. తన వంతుగా రాజేంద్ర మున్సిపల్ స్కూల్‌కు రూ.50 వేలు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి తపోవనం పాఠశాల అభివృద్ధికి రూ.50వేలు అందజేశారు. వేడుకలలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఎంఈఓ వెంకటస్వామి, ఎస్ఎంసీ ఛైర్మన్ ఫక్కీరప్ప, తహసీల్దార్ హరికుమార్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు డిష్‌నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివితే బంగారు భవిష్యత్తు: ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, డిసెంబరు 7: విద్యార్థులు బాగా చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుళ్ళసముద్రం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విశ్వనాథ్ అధ్యక్షతన జరిగిన పీటీఎంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధి పట్ల శ్రద్ధ పెడుతున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల విశ్రాంతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి ఎంఈఓలు భాస్కర్, టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, లక్ష్మీనారాయణ,డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ సర్పంచు జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను ప్రోత్సహించండి: కందికుంట



కదిరి బాలికల ఉన్నతపాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి/నంబులపూలకుంట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను సాంకేతిక పట్ల ప్రోత్సహించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. కదిరిలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, నంబులపూలకుంట మండలం కమ్మగుట్టపల్లి మండల పరిషత్ పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. భవిష్యత్తు కృత్రిమ మేధస్సుదేనని, అందుకు అనుగుణంగా సాంకేతిక విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలలో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పాఠశాలలో తల్లిదండ్రులసమావేశం ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేకుమార్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో వీఎస్ శర్మ, డీఎస్పీ శివనారాయణ, ఎంఇఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి, గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, హెచ్ఎంలు వెంకటాచలం, లియాఖత్, జయప్రతాప్, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, కౌన్సిలర్ రంగారెడ్డి, రాజేంద్రనాయుడు, దండే రవిశంకర్, బాషా, హనుమంతు రెడ్డి, రెడ్డెప్ప, ఉపాధ్యాయుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చొరవతో సంక్షేమ గురుకులాలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



టేకులోడు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మమేకమైన మంత్రి సవిత

చిలమత్తూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులకు వారధిగా ఉండేలా మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. టేకులోడు బాలిక గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. ఎన్టీఆర్ చొరవతో బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల సంక్షేమ పాఠశాలలు ఆవిర్భవించాయని అన్నారు. తద్వారా ఎంతో మంది బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న 107 బీసీ హాస్టళ్లలో 105 టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినవే అని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఆగిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రూ.25 కోట్లు మంజూరు చేశారని అన్నారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం అవసరమని అన్నారు. విద్యార్థులు నేరాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు మత్తుకు బానిసలయ్యారని అన్నారు. విద్యార్థినులు దేనికీ భయపడకూడదని, సమస్యలను ఎదుర్కొని నిలబడాలని సూచించారు. పదో తరగతిలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఫలితాలు సాధించి, ఎమ్మెల్యే బాలకృష్ణకు గిఫ్ట్‌గా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు రంగారెడ్డి, బేకరీ గంగాధర్, సోమశేఖర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విలువలతోనే రాణింపు: అశ్మిత్



యాడికి కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి/యాడికి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులు ఉన్నతస్థాయిలో రాణించగలరని తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి అన్నారు. యాడికి కేజీబీవీ, తాడిపత్రి శ్రీనివాసపురం ట్రిపుల్ ఎస్ పాఠశాలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. చదివిన పాఠశాలను, స్వగ్రామాలను మరచిపోకుండా వాటి అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషిచేయాలని అన్నారు. వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. యాడికి మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, మాజీ సర్పంచు విజయలక్ష్మి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు నాగలక్ష్మి, మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, ఎంఈఓ కాశప్ప, కేజీబీవీ ఎస్ఓ నిర్మల, తహసీల్దారు రజాక్‌వలి, ఎంఈఓ నాగరాజు, నాయకులు రామచంద్రారెడ్డి, అఖిల్, అరవింద నారాయణరెడ్డి, సంజీవపురం పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కారంతో ఎదగాలి: గుమ్మనూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని, సంస్కారవంతులుగా ఎదగాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. ఎస్జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేడుకలలో ఆయన పాల్గొన్నారు. కాలానికి అనుగుణంగా తల్లిదండ్రులు పిల్లల నడవడిని గమనించాలని సూచించారు. విద్యార్థులు తమ గురువులను గౌరవించాలని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన తల్లిదండ్రులకు బహుమతులను అందజేశారు. హెచ్ఎం గోపాల్ రెడ్డి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, గుజరీ మహమ్మద్ ఖాజా, ఫజులు, పెంచలపాడు వెంకటేశులు, న్యాయవాది వెంకటేశులు, వాసగిరి మణికంఠ, వనగొంది విజయలక్ష్మి, కొలిమి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అందరిలో అంటే ఎలా అమ్మా?



అనంతపురం రాజేంద్ర నగరపాలిక పాఠశాలలో అందరూ సంతోషంగా ఉంటున్న సమయంలో ఈ బంగారు తల్లి ఎందుకు ఏడుస్తోందో తెలుసా..? 'బాగా చదవకుంటే ఎలా..?' అని అందరి ఎదుటా అమ్మ మందలించినందుకు..! స్నేహితుల నడుమ.. ఇలా అడగకూడదు కదమ్మా..! పదిమందిలో పొగడాలి.. ఏకాంతంలో హితవు పలకాలి..!

బడికి సక్రమంగా పంపండి: సింధూర



పెడపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్/ఓబుళదేవరచెరువు/నల్లమాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పిల్లలను పాఠశాలలకు సక్రమంగా పంపించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తల్లితండ్రులకు సూచించారు. పెడపల్లి జడ్పీఉన్నత పాఠశాల, ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్ల ప్రభుత్వ ఉన్నతపాఠశాల, నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నతపాఠశాల, రామాపురం గురుకుల వసతి పాఠశాలలో నిర్వహించిన వేడుకలలో ఆమె పాల్గొన్నారు. బడికి సక్రమంగా పంపితే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. పిల్లల నడవడికపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు నిఘా వేయాలని, వారు వ్యసనాలబారిన పడకుండా చూడాలని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తోందని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ బడ్జెట్లో విద్యకు రూ.29,904 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. కార్యక్రమాలలో ఎంఈఓలు సురేష్, రమణ, హెచ్ఎంలు జంషీద్‌బాషా, సుధారాణి, భాస్కర్, రమణి, స్కూల్ కమిటీ ఛైర్మన్‌లు రవి, బాబునాయక్, కూటమి నాయకులు సామకోటి ఆదినారాయణ, బొమ్మయ్య, శ్రీరాంనాయక్, నాగరాజు, జయచంద్ర, జాకీర్ అహమ్మద్, రాజారెడ్డి, జెరిపిటి అంజనప్ప, ఇర్షాద్, షానవాజ్, బడిశం రామాంజి, జయంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట: జేసీ

నల్లమాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని, ఉన్నతస్థాయికి చేరాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల గురించి ఉపాధ్యాయులతో తరచూ మాట్లాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేమనారాయణ, సురేష్, డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ దాదాపీర్ పాల్గొన్నారు.

విలువలను పెంచండి: వెంకటశివుడు యాదవ్



గుత్తిలో మాట్లాడుతున్న వెంకటశివుడుయాదవ్

గుత్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో మానవీయ విలువలను పెంచాలని, వారికి మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమయం కేటాయించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ కోరారు. గుత్తి, గుత్తి ఆర్ఎస్ ప్రభుత్వ పాఠశాలలలో జరిగిన వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. వేడుకలలో ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఎంఈఓ రవినాయక్, సీఐ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్, నారాయణ, ఎంకే చౌదరి, బద్రివలి పాల్గొన్నారు.



అమ్మ చేతి ముద్ద.. కమ్మగా..



చదివిన బడికి రాయల్ మురళి సాయం.. రూ.50 వేలు



బుజ్జోడి బుర్రలో ఏవేవో ప్రశ్నలు.. అక్కను అడుగుదామంటే.. లాంగ్వేజ్ ప్రాబ్లమ్..!



ఎప్పటికీ గుర్తుండిపోయేలా.. ఎమ్మెల్యే పరిటాల సునీత గోరు ముద్ద.. చిత్రాన్ని దాచుకో చిన్నారీ..!

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.35

అనంతపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 35తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 30, కనిష్ఠ ధర రూ. 20 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 40,100 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 19,200, సరాసరి రూ. 38,600తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 31 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బుక్కపట్నం, మడకశిర, పెనుకొండ, హిందూపురం, ధర్మవరం, కదిరి కేంద్రాల్లో మూడు నెలలపాటు ఉచితగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి అయిన యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించడంతోపాటు వారి నైపుణ్యాన్ని బట్టి ఇతర రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసు ఛేదింపు

బంగారు ఆభరణాలు రికవరీ

బ్యూటీషియనే నిందితురాలు

పామిడి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో గత శుక్రవారం వివాహ వేడుకలో 38 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైన విషయం తెలిసిందే. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో సీఐ యుగంధర్ చోరీ వివరాలు వెల్లడించారు. ఫంక్షన్ హాల్లో మండలంలోని రామరాజుపల్లికి చెందిన విశ్వనాథ రెడ్డి కుమార్తె వివాహ వేడుక జరుగుతోందని, అందులో పెళ్లికుమార్తె గదిలో ఉంచిన 38తులాల బంగారు వడ్డాణాలు చోరీకి గురయ్యాయని అన్నారు. దీంతో విశ్వనాథరెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. తాము సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టామన్నారు. పెళ్లి కుమార్తెకు మేకప్ వేయడానికి వచ్చిన బ్యూటీషియన్ స్థానిక జాతీయ రహదారిపై స్పీడు బ్రేకర్ల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఆమె చోరీకి పాల్పడినట్లు ఒప్పుకుందన్నారు. అనంతరం వడ్డాణాలను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఇశ్రాయిల్, రామాంజనేయులు, కానిస్టేబుళ్లు రవీంద్ర, ఓబులేసు, నాగార్జున పాల్గొన్నారు.

అనుమానాస్పదరీతిలో వృద్ధుడి మృతి

- కేసు పరిధిపై రైల్వే, పట్టణ పోలీసుల మధ్య రచ్చ



నడిపి కంబగిరి (ఫైల్)

తాడిపత్రి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం అనుమానాస్పద రీతిలో నడిపి కంబగిరి (64) మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లికి చెందిన నడిపి కంబగిరి చిత్తూరులో ఒక గ్రానైట్ పరిశ్రమలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 1న పింఛన్ తీసుకొనేందుకు స్వగ్రామానికి వచ్చాడు. అనంతరం శనివారం చిత్తూరుకు వెళ్లేందుకు తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. కొంతసమయం తర్వాత ప్లాట్‌ఫారం చివరికి వెళ్లాడు. అక్కడే బ్యాగ్‌ను పెట్టుకొని కూర్చొన్నాడు. అయితే కొద్ది సేపటి తర్వాత ప్లాట్‌ఫాంకు కొంత దూరంలో నడిపి కంబగిరి శవమై కనిపించాడు. శరీరంపై రక్తగాయాలు కూడా ఉన్నాయి. ఎవరో కొట్టినట్లు శరీరంపై రక్తంతో కూడిన గాయాలు ఉండటంతో ఎవరైనా హత్యచేశారా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మద్దమ్మ, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికి వివాహాలు అయ్యాయి.

కేసు కట్టడానికి రెండు గంటలు

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం వద్ద మృతదేహం కనిపించడంతో రైల్వే పోలీసులు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా ప్రదేశానికి చేరుకున్న పోలీసులు ఈ ప్రాంతం తమ పరిధిలోకి రాదని రైల్వేపోలీసులకు తెలియజేశారు. మాకు కూడా సంబంధం లేదని రైల్వే పోలీసులు పట్టణ పోలీసులతో సుమారు రెండుగంటలపాటు చర్చించారు. అంతసేపు మృతదేహం అక్కడే ఉంది. రైల్వేపోలీసులు చేతులు ఎత్తేయడంతో చివరికి పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరి ప్రదక్షిణ

- గిరిజన గ్రామాల అభివృద్ధికి కేంద్రం చర్యలు
- ధర్తీ ఆబా జన్ జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ వర్తింపు
- విద్య, వైద్యం, జీవనోపాధుల మెరుగుకు శ్రీకారం
- జిల్లాలో ఐదు గ్రామాల ఎంపిక
- సమస్యలు గుర్తిస్తున్న అధికారులు



గిరిజన సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గిరిజనుల జీవనోపాధులు మెరుగు పరిచి, వారిని అభివృద్ధి చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ధర్తీ ఆబా జన్‌జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా అత్యంత వెనుకబడిన గ్రామాలను ఎంపిక చేసి అభివృద్ధి చేయనున్నారు. అందులో భాగంగా జిల్లాలోని ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. శింగనమల మండలంలోని నాగులగుడ్డం, నాగులగుడ్డం తండా, గుంతకల్లు నియోజకవర్గంలోని గుండాల తండా, వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి చిన్న తండా, పెద్ద తండాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల అభివృద్ధి బాధ్యతలను గిరిజన సంక్షేమశాఖకు అప్పగించారు. దీంతో ఆ శాఖాధికారులు ఇప్పటికే ఆయా గ్రామాల్లో సమస్యలను గుర్తించే పనిలో పడ్డారు.

చేపట్టబోయే పనులివే..

కేంద్రం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా జన్‌జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పథకం ద్వారా 15 రకాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన గిరిజన సంక్షేమశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గిరిజన గ్రామాల్లో ఇళ్లు లేని గిరిజనులకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటారు. గృహాలకు విద్యుత్ కనెక్షన్లు, సోలార్ వంటి సౌకర్యాలు కల్పిస్తారు. గిరిజన గ్రామాల్లోని ప్రజలకు వైద్యం కోసం 1000 పేరుతో మొబైల్ సంచార వాహనాల ద్వారా మెడికల్ యూనిట్లను నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఆయా గ్రామాల జనాభాను బట్టి మినీ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. అటవీశాఖ భూముల్లో ఇంతకుముందే సాగులో ఉండి పట్టాలు కలిగిన గిరిజనులకు పలు రకాల పంటల పండించుకునేందుకు ప్రోత్సహించనున్నారు. గిరిజన గ్రామాల్లో సరైన రోడ్ల నిర్మాణం, అటవీహక్కుల చట్టం కింద ఎఫ్ఆర్‌ఏ కేంద్రాలు ఏర్పాటు, సికిల్ సెల్ వ్యాధి కలిగిన వారికి అవగాహన, సామర్థ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రతి ఇంటికి జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి కొళాయి కనెక్షన్లు, అవసరమైన చోట ఓవర్ హెడ్ ట్యాంకులు, పంపు సెట్ల నిర్మాణం, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, సమగ్రశిక్షణ అభియాన్ కింద గిరిజన విద్యార్థులకు వసతిగృహాలు, టెలికామ్ సేవలు, చేతివృత్తులపై ఆధారపడి సరైన ఉపాధి లేక వలసలు పోతున్న గిరిజనులకు జీవనోపాధుల కింద గొర్రెల పెంపకం, డెయిరీల ఏర్పాటు, చేపల పెంపకం, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ వంటి సౌకర్యాలు కల్పించనున్నారు.

18 శాఖల సమన్వయంతో...

గిరిజన గ్రామాల అభివృద్ధికి జిల్లాలోని 18 ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసినట్లు గిరిజన సంక్షేమశాఖాధికారులు తెలిపారు. ఇందులో గృహనిర్మాణాలకు సంబంధించి హౌసింగ్, రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీరాజ్, విద్యుత్ సౌకర్యం కోసం ఏపీఎస్‌పీడీసీఎల్, తాగునీటి కల్పన కోసం ఆర్‌డబ్ల్యూఎస్, సోలార్ ఎలక్ట్రిసిటీ కోసం నెడ్‌క్యాప్, ట్రాన్స్‌కో, వైద్యం కోసం డీఎంహెచ్ఓ, రేషన్ కార్డు పంపిణీ కోసం డీఎస్ఓ, అంగన్‌వాడీల నిర్మాణం కోసం ఐసీడీఎస్, ఎస్ఎస్ఏ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అవగాహన కోసం ఈఎంఆర్ఎస్, టెలికామ్ కోసం బీఎస్ఎన్ఎల్, స్కిల్ డెవలప్‌మెంట్, వ్యవసాయశాఖ, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ, డీపీఓ, టూరిజం, గిరిజన సంక్షేమశాఖలను సమన్వయం చేసుకొని ఏ ఏ అభివృద్ధికి సంబంధించి శాఖలు ఉంటాయో... ఆయా శాఖల ద్వారా పనులు నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించిన కలెక్టర్

గిరిజన గ్రామాల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రెండుసార్లు 18 శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా సంబంధిత శాఖాధికారులు సమస్యలను గుర్తించి ఆయా పనులు పూర్తిస్థాయిలో వేగవంతం చేయాలని సూచించారు. మరో వారంలో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి ఆయా గ్రామాలకు విడతల వారీగా పలు శాఖలను సమన్వయం చేసి పనులు కేటాయించనున్నట్లు సమాచారం.

ప్రపోజల్స్ పంపాం..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధర్తీ ఆబా జన్‌జాతీయ ఉత్కర్ష్ గ్రామ అభియాన్ పథకం కింద జిల్లాలో ఐదు గ్రామాలు ఎంపికయ్యాయి. ఆయా గ్రామాలకు సంబంధించిన సమస్యలను వెలికితీస్తున్నాం. ఆయా సమస్యలను సంబంధింత శాఖలకు వివరిస్తున్నాం. దాదాపు 18 శాఖలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రపోజల్స్ పంపాం. వారి ఎస్టిమేషన్స్ వేసి మరోమారు జిల్లా కలెక్టర్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తరువాత పనులు మొదలవుతాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని శాఖల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

- రామాంజనేయులు, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి

డీఎన్‌ఏ రిపోర్టులో ఏముందో..?

ఆ మృతదేహం రామాంజినమ్మదేనా...?

రెండు నెలల కిందట పశుసంవర్ధకశాఖ అటెండర్ అదృశ్యం



అనంతపురం క్రైం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): గత నెలలో లభ్యమైన ఓ మహిళ మృతదేహానికి సంబంధించి డీఎన్ఏ రిపోర్టులో ఏముందనే విషయం ప్రస్తుతం చర్చకు దారి తీస్తోంది. ఆ మృతదేహం రామాంజినమ్మదేనని ఆమెకు సంబంధించిన ఆనవాళ్లు బలం చేకూరుస్తున్నా, దానిపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. పశుసంవర్ధక శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న రామాంజినమ్మ నగర శివారులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని లలితానగర్‌లో కొడుకు మోహన్‌రావుతో నివాసముండేది. అక్టోబరు 17న విధులకు వెళ్లిన ఆమె 18న ఉదయం నుంచి కనిపించకుండా పోయింది. అదే రోజు ఆమె హత్యకు గురైనట్లు సమాచారం. కాగా వివాహమై మరో ఊర్లో ఉంటున్న రామాంజినమ్మ కుమార్తె అశ్విని తన తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో విషయాన్ని సోదరుడు మోహన్‌రావుకు తెలియజేసింది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న అతను హైదరాబాద్‌కు వెళ్లడంతో రావడం ఆలస్యమైంది. ఈ క్రమంలో ఆమె ఎక్కడ అదృశ్యమైంది, ఎక్కడ ఫిర్యాదు చేయాలనే విషయంలో వన్‌టౌన్, రూరల్ పోలీస్‌స్టేషన్లకు తిరిగారు. ఎట్టకేలకు అక్టోబరు 28న అనంతపురం రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఆ రోజే హత్య..?

తొలుత రూరల్ సీఐ శేఖర్ దర్యాప్తులో భాగంగా రామాంజినమ్మ కుమార్తె, కుమారుడుతో కలిసి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో బీరువా పగల కొట్టి ఉండటం, సీసీ కెమెరా ధ్వంసం చేసి ఉండటం, రక్తపు మరకలున్న రోకలిబండ ఉండటం అనుమానాలకు తావిచ్చాయి. విచారణలో భాగంగా అనుమానితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసులు కాల్ రికార్డింగ్ ఆధారంగా విచారిస్తే అసలు గుట్టు బయటపడింది. రామాంజినమ్మ ఉంటున్న ఇంటి ఎదురుగా కొంతకాలం ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఆ ఇంటిలో బేల్దారి పనిచేసే ఓ యువకుడితో రామాంజినమ్మకు పరిచయమైంది. ఆ పరిచయం సాన్నిహిత్యం మారినట్లు సమాచారం. ఈక్రమంలోనే ఆ యువకుడు మరో యువకుడితో కలిసి ఈ నెల 18న ఉదయం రామాంజినమ్మ ఇంటికి వెళ్లారు. ఇద్దరూ ఆమె పై దాడి చేసిననట్లు సమాచారం. ఆమె తలపై సుత్తితో మోదగా మృతి చెందింది. అనంతరం ఇంట్లోని బీరువాలో ఉన్న 4తులాల బంగారు నగలు, రూ.40వేల నగదు తీసుకెళ్లారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో వచ్చి మృతదేహాన్ని బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సీసీ కెమెరాలు పగలకొట్టారు. రాత్రి శవం మాయం చేశారు.

20 రోజుల తరువాత మృతదేహం లభ్యం

పోలీసులు పలు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు 20 రోజుల అనంతరం ఓ మహిళ మృతదేహం కనిపించింది. నవంబరు 8న రామాంజినమ్మ ఇంటి సమీపంలో ఖాళీ ప్రదేశం, ముళ్లకంపలున్న ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. చెత్తలో, అందులోనూ బండరాళ్ల కింద దాచిపెట్టడం, మూడువారాలు కావడంతో శవం దాదాపు అస్థిపంజరంగా మారింది. అయితే మృతదేహంపై ఉన్న చీర, ఇతర ఆనవాళ్ల మృతదేహం రామాంజినమ్మదే అని చెప్పాయి. కానీ నిర్ధారణ కావాల్సి ఉంది.

డీఎన్‌ఏ రిపోర్టుపై ఎస్పీ ఆరా

పోలీసులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం డీఎన్ఏ టెస్ట్ కోసం పంపారు. డీఎన్ఏ రిపోర్ట్ రావడానికి 15రోజులు లేదా నెలరోజుల సమయం పడుతుందంటారు. ఇప్పటికే నెలకావస్తోంది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా తాజాగా పోలీస్ అధికారుల సమీక్షలో రామాంజినమ్మ హత్యకేసు విషయం, డీఎన్ఏ రిపోర్ట్ పైనా ఎస్పీ ఆరా తీశారు. రిపోర్ట్ ఇంకా రాలేదా అని అడిగినట్లు తెలిసింది. డీఎన్ఏ రిపోర్టు ఆధారంగా ఆ మృతదేహం రామాంజినమ్మదే అని తేలితే కేసు, హత్యోదంతం బయటపడనుంది.

యాడికిలో 16.5 తులాల బంగారం చోరీ

యాడికి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కమ్మవీధిలో 16.5తులాల బంగారం చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు మినుమనూరు వెంకటశివ తెలిపిన మేరకు వెంకటశివ భార్యతో కలిసి ఈనెల 1న ఇంటికి తాళాలు వేసి మంత్రాలయం వెళ్లాడు. 3న తిరిగి వచ్చాడు. ఇంటిలోని బీరువాలో చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో చోరీ అయినట్లు గుర్తించి, విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే కేసు నమోదు చేయలేదు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న పోలీసులు కేసు నమోదు చేయడం లేదని బాధితుడు వాపోయాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నరేష్ (ఫైల్ ఫొటో)

ఆత్మకూరు డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు గ్రామానికి చెందిన నరేష్(25) అప్పుల బాధ తాళలేక శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు నరేష్ తనకున్న ఐదెకరాల భూమిలో మామిడి చెట్లు సాగు చేశాడు. అంతర పంటగా వేరుశనగ సాగు చేసేవాడు. పంటల పెట్టుబడులు, కుటుంబ జీవనానికి అప్పులు చేశాడు. అయితే వీటని తీర్చే మార్గం కానరాక ఇంటికి సమీపాన చెట్టుకి ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గుర్తించి, పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. ఇతడికి భార్య, కుమార్తె ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేపు అవగాహన సదస్సు

అనంతపురం రూరల్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అనంతపురం డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 9న ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు, అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డివిజన్ ఈఈ జేవీ రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం మీటింగ్ హాల్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు కార్యక్రమంలో జరుగుతుందన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ అధికారులు, సిబ్బంది అదాలత్‌కు హాజరవుతారన్నారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

అథ్లెటిక్ పోటీలు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2024 పోటీలు శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. పోటీలను ఎస్కేయూ ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రాథమిక దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడాపాలసీ బంగారు క్రీడాభవిష్యత్తుకు నాంది పలుకుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో మహిళా విభాగంలో 100మీటర్లలో మేఘన, 400మీటర్లలో పావని, 800మీటర్లలో వైష్ణవి, ఐదు కిలోమీటర్లలో రాజ్యలక్ష్మి, జావెలిన్‌త్రోలో వైష్ణవి, షాట్‌పుట్ మాలాశ్రీ, 4X100మీటర్ల రిలేలో ఎస్ఎస్‌బీఎన్, హిందూపురం ఎస్‌డీజీఎస్, ఎస్కేయూలు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందాయి. పురుషుల విభాగంలో 100మీటర్లలో చంద్రశేఖర్, 400మీటర్లలో విజయసాయి, సుభాష్, 800మీటర్లలో జయసాయి సుభాష్, 5 కిలోమీటర్ల గురురవితేజ, లాంగ్‌జంప్‌లో రవీంద్ర, జావిలిన్‌త్రో భరత్, షాట్‌పుట్‌లో భరత్, 4X100రిలేలో ఆర్ట్స్‌కాలేజీ, ఎస్కేయూ, ఎస్ఎస్‌బీఎన్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీరామ్, అథ్లెటిక్ కోచ్‌లు మంజుల, సురేష్, పీడీలు జయరామప్ప, శ్రీనివాస్ నాయక్, క్రీడాకారులు పాల్గొన్నారు.

హంద్రీనీవా విస్తరణ పనులు చేపట్టాలి

రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాలకు సాగు, తాగునీరు అందించే హంద్రీనీవా కాలవ కాంక్రీట్ లైనింగ్ పనులు ఆపి, కాలవ వెడల్పు పనులు చేపట్టాలని ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్ లైనింగ్ పనులు ఆపి, వెడల్పు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలో ఉన్న హంద్రీనీవా కార్యాలయం ఎదుట ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ గత ఎన్నిక సందర్భంగా హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచుతామని, అందుకు అనుగుణంగా వెడల్పు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇందుకు విరుద్ధంగా జీడిపల్లి నుంచి కుప్పం వరకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టేందుకు అనుమతివ్వడం దారుణమని మండిపడ్డారు. అనంతరం హంద్రీనీవా ఇన్‌చార్జి ఎస్ఈ నాగరాజను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాప్తాడు సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా రైతుసంఘం కార్యనిర్వాహక కార్యదర్శి వన్నారెడ్డి, నాయకులు రాము, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, అక్కులప్ప, రసూల్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపండి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు జిల్లాల అధికారులతో కోర్టులో శనివారం సమావేశం నిర్వహించారు. రాజీకి తగిన కేసులను ఎక్కువ సంఖ్యలో తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్, రెండు జిల్లాల ఎస్పీలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



జిల్లా న్యాయాధికారితో సమావేశమైన అధికారులు, న్యాయాధికారులు

అక్రమ మద్యంపై కఠిన చర్యలు తీసుకోండి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం సరఫరా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో శనివారం ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఏఈఎస్ రేవతితో కలిసి ఎక్సైజ్ సీఐలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా బెల్టుషాపులు ఏర్పాటు చేయకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తుంటే వాటిపై తక్షణమే దాడులు నిర్వహించి, నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం సరఫరా కాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘాను మరింతగా పెంచాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనల అతిక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేసిన తర్వాత తిరిగి అక్రమ మద్యం సరఫరాలో పట్టుబడిన 35 మందిని వారం రోజుల్లోగా తహసీల్దార్ వద్ద హాజరుపర్చి, బైండోవర్ అతిక్రమణ అపరాధ రుసుం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో వారిని జైలుకు పంపాలన్నారు.

సార్..! మా భూమి ఇప్పించండి

ఆర్డీఓ కాళ్లు పట్టుకున్న బాధితులు

గాండ్లపెంట, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): సార్..! పేదోళ్లం. మీ కాళ్లు మొక్కుతాం. భూమి మాకు ఇప్పించండి అంటూ రైతులు ఆర్డీఓ వద్ద ప్రాధేయపడ్డారు. మండలంలోని కటారుపల్లి గ్రామానికి చెందిన గంగన్నకు 1978లో ప్రభుత్వం భూమి ఇచ్చినట్లుగా ఓ పత్రం ఉంది. దాన్ని తీసుకుని నెల రోజుల కిందట రెవెన్యూ అధికారులను సంప్రదించామని గంగన్న కుమారులు ఓబులేసు, వేమనారాయణ తెలిపారు. రెవెన్యూ అధికారులు కొట్లపల్లి పొలంలో 1482 సర్వేలోని ప్రభుత్వ భూమి 2.41ఎకరాలు సాగు చేసుకోవడానికి అనుమతించారని బాధితులు చెప్పారు. ఇటీవల ఆ భూమిపైకి వెళ్లి ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారన్నారు. తమ తండ్రి పేరున పట్టా ఉన్న భూమిని సాగు చేయనివ్వలేదన్నారు. ఈక్రమంలోనే గత రెండు రోజులుగా కుటుంబసభ్యులతో కలిసి గాండ్లపెంటలో దీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఈవిషయం తెలుసుకున్న ఆర్డీఓ వీఎస్ శర్మ సంఘటనా స్థలానికి శనివారం వచ్చారు. బాధితులతో మాట్లాడారు., ఈసర్వే నెంబరులో వంక పొరంబోకు నిషేధిత భూములన్నారు. ఎవరికీ పట్టాలించేందుకు కుదరదని, గతంలో ఇచ్చిన పట్టా నకిలీందన్నారు. ఇలాంటివి చెల్లవని బాధితులకు ఆర్డీఓ తెలిపారు. దీంతో బాధితులు బోరున విలపిస్తూ తమ భూమిని ఇప్పించాలిని ఆర్డీఓను కాళ్లు పట్టుకున్నారు. ఇప్పటికే ఈ భూమి అభివృద్ధి కోసం రూ. 50వేలు ఖర్చు పెట్టామన్నారు. కూలికి పోతేనే పూటగడిచే మాలాంటి వారితో రెవెన్యూ అధికారులు ఆటలాడడం సరికాదన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, విఆర్ఓలు వెంకటరమణ, క్రిష్టప్ప, రామమోహన్, సర్వేయర్లు ఉన్నారు.

నేడు చం.స్పందన సభ

అనంతపురం కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో చం.స్పందన జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు స్పందన అనంత కవుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. జిల్లాకు చెందిన సీనియర్ రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిని 'చం. స్పందన జీవన సాఫల్య పురస్కారం' కోసం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న పురస్కార ప్రదానోత్సవ సభలో రాచపాళెంకు జీవన సాఫల్య పురస్కారంతోపాటు నగదు బహుమతి అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు.

973 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు శనివారం కృష్ణా జలాలా ఇన్‌ఫ్లో 973 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ - 2కు 910 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

ఆకతాయిల దాడి.. ముగ్గురికి గాయాలు

తాడిపత్రి, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం జీరో రోడ్డులో బాలికలను వేధిస్తున్నవారిని మందలించిందుకు ఆకతాయిలు దాడి చేశారు. దీంతో శంకర్, నాగేంద్ర, సుబ్బరాయుడు అనే ముగ్గురు గాయపడ్డారని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన భాస్కర్, అమర్, వరుణ్ తదితరులు ఈవ్ టీజింగ్ చేస్తుండగా, అక్కడే ఉన్న బేల్దారి శంకర్ మందలించాడు. అప్పటికి వెళ్లిపోయిన ఆకతాయిలు.. మరికొందరితో కలిసి వచ్చి శంకర్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న నాగేంద్ర, సుబ్బరాయుడు విడిపించడానికి వెళ్లడంతో వారిపైనా నాపరాళ్లతో దాడిచేశారు. దాడిలో శంకర్, సుబ్బరాయుడుకు స్వల్పగాయాలయ్యాయి. నాగేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగేంద్ర పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు.

సంక్షిప్తం

శాశ్వత సభ్యత్వం స్వీకరణ



శాశ్వత సభ్యత్వం తీసుకున్న వెంకట సుబ్బన్న

శింగనమల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సైకిల్ యాట వెంకటసుబ్బన్న పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఆయన శని వారం అనంతపురంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సమక్షంలో ఆన్‌లైన్‌లో రూ.లక్ష చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయడం ఖాయం అని అన్నారు.

ఉద్యోగ సాధనే లక్ష్యం కావాలి

● సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సాధనే లక్ష్యంగా పెట్టుకుని ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు చివరి సంవత్సరంలోనే ఫలితాన్ని పొందగలరని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. రెండు రోజులపాటు సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ కోరి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించేలా వర్సిటీ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. మానవ వనరుల నిర్వహణ, పేరోల్, మూలధన వంటి రంగాల్లో సేవలందిస్తున్న ఏడీపీ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. 146మంది విద్యార్థులు హాజరు కాగా 52మంది ఆన్‌లైన్ మూల్యాంకనంలో ప్రతిభ కనబరిచారని తెలిపారు. 32మంది వాయిస్, యాక్సెంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. వీరిలో వర్సిటీ విద్యార్థులైన త్రిపాఠి, అల్మాస్ ఫాత్మా, కిష్‌సూద్, సృజన, కుమారి ప్రతిభను చాటారని తెలిపారు.

తుమ్మల సత్యకు నివాళులు



నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పరిటాల కుటుంబం, టీడీపీ వీరాభిమాని తుమ్మల సత్యకు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ నివాళులు అర్పించారు. విజయవాడకు చెందిన తుమ్మల సత్య అనారోగ్యంతో మృతి చెందారు. అనంతపురంలోని తమ నివాసంలో శనివారం తుమ్మల సత్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

● రామగిరి: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం తుమ్మల సత్యన్న చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూల మాలవేసి నివాళులర్పించారు. తుమ్మల సత్యన్న మృతి బాధాకరమన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి మారుతిప్రసాద్, తెలుగుయువత మండల అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు, నాయకులు మాదాపురం శంకర, ఎంపీటీసీ శ్రీనివాసులు, గుర్రం శీన, రఘురాములు, ఆనంద్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే.. క్షేమం



ఏజీఎం, ఎస్ఐకి విద్యార్థుల ఆహ్వానం

అనంతపురం విద్య, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే, క్షేమంగా గమ్యం చేరుతారని ఏజీఎం సుబ్బారెడ్డి, సీఐ రఘు బాబు, ఎస్ఐ విజయ్ భాస్కర్‌రాజు పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డులోని శ్రీచైతన్య స్కూల్-8 ఆధ్వర్యంలో శనివారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ నుంచి విద్యుత్ నగర్ సర్కిల్ వరకు ట్రాఫిక్ నినాదాలతో ర్యాలీ చేశారు. తర్వాత సర్కిల్‌లో మాబ్ డ్యాన్సులు చేస్తూ, అవగాహన కల్పించారు. తర్వాత ఏజీఎం, సీఐ తదితరులు మాట్లాడుతూ.... హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వాడకం వంటి జాగ్రత్తలను వివరించారు. అతి వేగం ప్రమాదకరం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ అరుణ్‌కిరణ్, ఇతర స్టాఫ్ శివప్రకాష్, అర్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ పరికరాల చోరీ

గార్లదిన్నె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో ఓ వ్యవసాయ తోటలో శుక్రవారం రాత్రి విద్యుత్ పరికరాలు చోరీ అయ్యాయి. కోటంక గ్రామానికి చెందిన ఎల్లమ్మ, భాస్కర్‌రెడ్డి అనే ఇద్దరు రైతులు చీనీచెట్లు సాగుచేస్తున్నారు. ఆ వ్యవసాయ తోటల్లో అమర్చిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం రాత్రి దుండగులు పగులగొట్టి వాటిలోని అల్యూమినియం, కాపర్ వైర్లతో పాటు విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. రైతులు శనివారం ఉదయం తోటకు వెళ్లినప్పుడు చోరీ విషయం గుర్తించారు. సుమారు రూ. 80 వేలు విలువ చేసే సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా, ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.



శింగనమల జడ్పీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



పాపంపేటలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్



విద్యా సామగ్రి అందజేస్తున్న నారాయణ స్వామి

ఘనంగా ఆత్మీయ సమావేశం

గార్లదిన్నె, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఉజ్వల్ భవిష్యత్ కోసం బాగా చదువు కోవాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పాఠశాలల్లో పండుగలా నిర్వహించారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఈఓ తారా చంద్రానాయక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శారదాబాయి, సతీష్, పాఠశాల కమిటి చైర్మన్ ఎర్రిస్వామి, వడ్లరాము, సామాల మధు, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కులశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం రూరల్: మండలపరిధిలోని పాపంపేట పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశానికి మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఆట-పాటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. టీడీపీ నాయకులు రామాంజినేయులు, బాబావలి. గోవిందు, సాంబశివ తదితరులు పాల్గొన్నారు. అలాగే కురుగుంటలోని



చెన్నేకొత్తపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

అంబేడ్కర్ గురుకుల కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగురైతు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, కళాశాల కమిటీ చైర్మన్ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను శనివారం మండలంలోని అన్నిప్రభుత్వ పాఠశాలల్లో పండుగలా నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. చెన్నేకొత్తపల్లిలోని ఉన్నత పాఠశాలలో ఎస్ఐ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

● నార్పల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. బీ పప్పూరు పాఠశాలలో హెచ్ఎం రాధాశ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యా యులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. బాలుర పాఠశాలలో టీడీపీ నాయకులు ఆకుల బాబు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులకు పలు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. నార్పల సర్పంచు సుప్రియ, జడ్పీటీసీ నాగరత్నమ్మ, ప్రిన్సిపాల్ సంగీతకుమారి మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. విద్యార్థులకు అటల పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ బషీర్ ఇస్లాం, తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మల కుమారి, సీఐ కౌలుట్లయ్య, ఎంఈఓ నరసింహరాజు, విద్యాకమిటీ చైర్మన్ బోయ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● కనగానపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ వేడుకలు పండుగ వాతావరణంలో జరిగాయి. పిల్లలు, తల్లితండ్రులకు పలు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, టీడీపీ నాయకులు నెట్టెం వెంకటేష్, యాతం పోతలయ్య, అంకే రామక్రిష్ణ, బట్టా సురేష్‌చౌదరి, నాగభూషణం, చల్లా సోము తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్య క్రమంలో టీడీపీ మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, నాయకులు శశాంక చౌదరి, పాఠశాల కమిటి చైర్మన్ బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మాట్లాడుతున్న టీడీపీ మండల కన్వీనర్



అనంతపురంలోని పొట్టి శ్రీరాములు స్కూల్‌లో ...

అయ్యప్పస్వామికి విశేష పూజలు



పండ్లతో అలంకరణలో స్వామి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దీక్షామండల కాలాన్ని పురస్కరించుకుని శనివారం మొదటిరోడ్డులోని హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామిని పండ్లతో అలంకరించారు. స్వామివారి మూలవిరాట్‌కు భస్మాభిషేకం, ఫలపంచామృతా భిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో దీక్షధారులకు భిక్షను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, మాజీ కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, ఆలయ అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చౌక డిపోల్లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు చౌకడిపోల్లో విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సీఐ జమాల్ బాషా ఆధ్వర్యంలో పాతవూరు వేణుగోపాల్ నగర్‌లోని డీలర్ రాజేశ్వరికి చెందిన చౌక డిపోలో రికార్డులకు, నిల్వలకు వ్యత్యాసాలు ఉన్నట్లు సీఐ తెలిపారు. ఎక్కువగా ఉన్న నిల్వలను జప్తు చేసి, స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఈఈ రవీంద్రనాథ్, వీఆర్వో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాలొద్దు.. సమస్యలను పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
● కార్మికులకు యూనిఫామ్, చీరల పంపిణీ



యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్

అనంతపురం క్రైం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ధర్నాలు చేయాల్సిన అవసరం లేదని..వాటితో సమస్యలు పరిష్కారం కావని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరపాలిక పరిధిలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం కార్మికులకు యూనిఫామ్, చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ మహమ్మద్ వసీం, నగర కమిషనర్ నాగరాజు. డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... దసరా కంటే ముందుగా వీటిని పంపిణీ చేయాల్సి ఉందని, పంపిణీదారుల ఆలస్యం చేయడం వలన జాప్యం జరిగిందన్నారు. వచ్చే ఏడాది దసరాలోగా పంపిణీ చేస్తామన్నారు. 248 మంది రెగ్యులర్ కార్మికులకు మాత్రమే అందాయని, కాంట్రాక్టు కార్మికులకూ అందేలా చూస్తామన్నారు. కార్మికులు న్యాయంగా వారికి దక్కాల్సిన వాటి కోసం ధర్నాలు చేయవద్దని, సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. మరోసారి ధర్నాకు దిగితే పనిదినంగా లెక్కిస్తారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ... కార్మికుల సంక్షేమం కోసం పాలకవర్గం కృషి చేస్తుందన్నారు.

ధర్నాలు కొనసాగిస్తాం

కార్మికుల సమస్యలపై ధర్నాలు కొనసాగిస్తామని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు పేర్కొన్నారు. పంపిణీ కార్యక్రమం జరుగుతున్న క్రమంలోనే నాగరాజు మాట్లాడారు. ధర్నాలు చేయడం మా హక్కు అన్నారు. కార్మికులకు పనిముట్లు సకాలంలో ఇవ్వడం, కార్మికుల సంఖ్య పెంపు, సరెండర్ లీవులు పెండింగ్ ఉండటం, ఏళ్లతరబడి పనిచేస్తున్న కార్మికులకు ఇళ్ల స్థలాలు లేకపోవడం వంటి తదితర ఎన్నో సమస్యలను పరిష్కరిస్తే ఆందోళన చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు.

నైతిక విలువలు నేర్పాలి



విద్యార్థుల తల్లులకు జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చిన్నారులకు నైతిక విలువలు నేర్పాలని నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలామురళి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల తల్లులకు రంగోలి పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, గంగోత్రి, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అక్రమాల నియంత్రణపై దృష్టి: డీఎఫ్ఓ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనింగ్ అక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ అప్పా తెలిపారు. అటవీశాఖ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన శాఖ పరమైన అంశాలకు సంబంధించి పలు విషయాలను వెల్లడించారు. జిల్లాలోని అటవీస్థలాల్లో మట్టి అక్రమ తరలింపు నియంత్రణపై దృష్టి పెట్టామన్నారు. అటవీస్థలంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. అటవీస్థలాల ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించమన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ నిర్వహిస్తున్న పండితులు

గార్లదిన్నె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా శనివారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోటంక గ్రామానికి చెందిన ఆవుల నాగలక్ష్మి, ఆవుల కంచెప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సన్ని కన్నుల పండువగా జరిపించారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవం తిలకించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, సర్పంచు మేడాపురం లక్ష్మి, సుబ్బు, ఎర్రిస్వామి, చల్లానాగరాజు, రమణ, చౌదరి తదితరులు పాల్గొన్నారు.



గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించాలి

● ముఫ్తీ సయ్యద్ మాసూం



సదస్సులో ప్రసంగిస్తున్న ముఫ్తీ సయ్యద్ మాసూం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డును రద్దు చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించాలని జమాతే ఉలేమా యే హింద్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ముఫ్తీ సయ్యద్ మాసూం డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలోని ముస్లిం మైనార్టీలతో కలిసి నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. వక్ఫ్ స్థలాల బాధ్యత పూర్తిగా ముస్లింలకు సంబంధించిన అంశమని అన్నారు. తమ ఆస్తులు తమకు దక్కకుండా చేసేందుకు దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టేదిశగా సంస్థాగతంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, మేయర్ వసీం, నదీం అహ్మద్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ, ఏకే ఎస్ ఫయాజ్, ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు మౌలానా సబీల్, ముస్తాక్ అహ్మద్, జబీర్, తహవూర్ దస్తూర్, ఖాజీ హయత్ బాషా, అరీఫ్ సాహెబ్, జహీర్ అహ్మద్, న్యాయవాది రసూల్, ఆల్‌మేవా ఫక్రుద్దీన్, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న గౌస్‌మొద్దీన్, జాఫర్, మేయర్ వసీం, నదీం అహ్మద్, దాదాగాంధీ

మోడల్ ఆసుపత్రిగా మారుస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



వృద్ధులకు చేతికర్రలు, వాకర్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రాప్తాడు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ప్రభుత్వ ఆసుపత్రిని మోడల్ ఆసుపత్రిగా మారుస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. జాతీయ ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమంలో బాగంగా శనివారం రాప్తాడులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొలిసారిగా ప్రభుత్వం తరపున వృద్ధులు, వికలాంగులకు చేతి కర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా రాప్తాడులో హెల్త్ క్యాంపులు నిర్వహించి వృద్ధులు, వికలాంగులకు ఎంతో మేలు చేశామన్నారు. ఇప్పుడు కూడా తొలిసారిగా వృద్ధులు, వికలాంగులకు పరికరాలు అందిస్తున్నామన్నారు. వృథాగా ఉన్న 108 వాహనాలను ఆటో నగర్‌కు తరలించి మరమ్మతులు చేయించాలన్నారు. గతంలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న కారణంగా నియోజకవర్గంలో పరిటాల ట్రస్ట్ తరఫున మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. కానీ గత ప్రభుత్వంలో వాటిని మూసివేశారన్నారు. ఇప్పుడు మరోసారి వాటిని తిరిగి ప్రారంభించి ఫ్లోరైడ్ బారిన పడకుండా ప్రతి ఒక్కరికీ మినరల్ వాటర్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, వైద్యాధికారి శివకృష్ణ, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మీ ఇంటిని ఇలాగే పెట్టుకుంటారా..?

వార్డెన్‌పై మండిపడ్డ విజిలెన్స్ డీఎస్పీ



వార్డెన్ భాస్కర్‌రెడ్డిని హెచ్చరిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మీ ఇంటిని ఇలాగే పెట్టుకుంటారా..? మీ ఇంట్లో పల్లలకు ఇలాంటి భోజనమే పెడతారా అంటూ విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం బీసీ బాయ్స్ హాస్టల్-2 వార్డెన్ భాస్కర్‌రెడ్డిని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీనరసయ్య కాలనీ గంగమ్మ గుడి సమీపంలో ఉన్న బీసీ బాయ్స్ హాస్టల్-2ను ఆయన శనివారం విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్‌తో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం ఏమిటని మందలించారు. మరుగుదొడ్లు ఇంత దారుణంగా ఉంటే విద్యార్థులు ఎలా వినియోగిస్తారన్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించి వంటలు రుచికరంగా లేవన్నారు. నిత్యవసర సరుకుల విషయంలో రికార్డులకు, నిల్వలకు వ్యత్యాసం ఉందని డీఎస్పీ తెలిపారు. బయోమెట్రిక్ హాజరులో పొంతన లేదన్నారు. వైద్య సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నట్లు పలువురు విద్యార్థులు తన దృష్టికి తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు పలు వ్యాధులతో బాధపడుతున్నట్లు తనిఖీల్లో బయటపడిందని తెలిపాన్నారు. 111 మంది విద్యార్థులకు కేవలం నాలుగు స్నానపు గదులు, నాలుగు మరుగుదొడ్లు ఉన్నాయని తెలిపారు. వాటినీ వినియోగించలేని దుస్థితిలో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఉన్న గదులు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. ఇక్కడ నెలకొన్న సమస్యలపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని, అందుకు తగిన విధంగా తగిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

చైర్మన్‌కు శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ సలహా కమిటీ చైర్మన్ రఘురామరాజుకు ఉమ్మడి జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణం శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలో శనివారం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆయనకు శాలువ కప్పి, జ్ఞాపికను అందజేశారు.

విజయసాయికి సేవారత్న

అనంతపురం కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ సేవారత్న అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ సామాజిక వేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాన్ ఇండియా కల్చరల్ సోషియో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని సంస్థ కార్యాలయంలో శనివారం అవార్డు అందజేశారు. జిల్లా తరపున ఎంపికైన విజయ సాయికుమార్‌కు శ్రావణి మీడియాస్ ఎండీ శ్రావణి, టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ కోఆర్డినేటర్ రాజశేఖర్, సామాజికవేత్త సుశీల్‌కుమార్ అవార్డు అందజేసి సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో షష్ఠి పూజలు




చెరువుకట్టపై వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



శివబాలయోగి ఆశ్రమంలో..

అనంతపురం కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మార్గశిర శుద్ధ షష్ఠి సందర్భంగా సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శనివారం నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చెరువుకట్టపై వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంలో మూల వి రాట్‌కు పంచామృతాభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ నంబూద్రి నేతృత్వంలో స్వామివారి ఉత్సవ మూర్తికి ప్రాకారోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. బెంగళూరురోడ్డులోని శివకోటి దేవాలయం, శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలోనూ వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు చేశారు. శివబాల యోగి ఆశ్రమంలో అన్నదాన వినియోగం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు దేవరాజు, కార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి ప్రసాద్, చెన్నకేశవులు, లక్ష్మీనారాయణ, జూటూరు మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్య సభ్యులు

ఉద్యోగాలకు ఎంపిక

అనంతపురం రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ష్నైడర్ ఎలక్ట్రిక్ కంపెనీలోని ఉద్యోగాలకు పీవీకేకే ఐటీ విద్యార్థులు 40మంది ఎంపికయ్యారు. కంపెనీ ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో రాత పరీక్ష, ముఖాముఖి ఇంటర్వ్యూలో ఈఈఈ, ఈసీఈ, మెకానికల్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బండి రమేష్ బాబు తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.2.6లక్షలు ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, ఇతర కళాశాల యాజమాన్య సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, డీన్ ఆఫ్ ప్లేస్మెంట్స్ భానుకిరణ్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీస్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

కూడేరు, డిసెంబరు,7 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రారంభించారు. పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. నాడు- నేడు పనుల్లో భాగంగా ప్లాంట్ పనులు నిలిచిపోవడంపై గత సెప్టెంబరు 17న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు అప్రమత్తమై వాటర్‌ప్లాంట్ పనులు పూర్తి చేశారు. కలెక్టర్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రాము, హెచ్ ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెట్టికంటికి వెండి హారం

గుంతకల్లు టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి వారికి కర్నాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన భక్తులు దేవ, లక్ష్మీదేవి వెండి హారాన్ని సమర్పించారు. 1కేజీ 257గ్రాముల వెండి హారాన్ని ఆలయ ఏఈఓ వెంకటేశ్వరుడికి శనివారం వారు వారు అందజేశారు. తొలుత అర్చకులు దేవా, లక్ష్మీదేవికి స్వామి దర్శనం చేయించి అర్చనలు జరిపించి తీర్థప్రసాదాలు అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీరప్ప సర్కిల్‌లో శనివారం ఓ కారు నుంచి 20 కేసుల కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ తెలిపారు. బీరప్ప సర్కిల్‌లో ఏపీ0240టీకే నంబరు గల కారులో కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేశామన్నారు. ఇందులో 20 కేసుల్లో 1920 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. తరలిస్తున్న పల్లీ అంజన్‌పవన్‌కుమార్, బోయ వాసును అరెస్టు చేశామన్నారు. అలాగే మండలంలోని మొలకలపెంట గ్రామ శివారులో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి 550లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని, 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని సీఐ చెప్పారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సునంద, ఎస్‌ఐలు సత్యనారాయణ, సుశీలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, ఎక్సైజ్ సీఐ హసీనాబాను పట్టుకున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని తిప్పారెడ్డిపల్లి నుంచి కళ్యాణదుర్గం పట్టణానికి మద్యాన్ని తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి కొత్తూరు క్రాస్ వద్ద పట్టుకున్నారు. 1440 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, వాటిని తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మత్తు పదార్థాలపై అవగాహన

తాడిపత్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టెక్ కళాశాలలో మత్తుపదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి రూరల్ ఎస్‌ఐ కాటయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం మత్తుపదార్థాలు చాక్లెట్లు, ట్యాబ్లెట్ల రూపంలో దొరుకుతున్నాయన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నతశిఖరాలకు చేరాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కళాశాల డైరెక్టర్ నటరాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రామనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-రాయచూరు రైలు మార్గంలోని నేమకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైలులో నుంచి జారిపడడంతో తలకు తీవ్రగాయమై మృతి చెందాడన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

బొమ్మనహాళ్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి రమ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల గ్రంథాలయ భవనమును పంచాయతీ కార్యాలయంలోకి మార్చడంపై ఆమె పరిశీలించారు. గ్రంథాలయంకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి గ్రంథాలయానికి పాఠకుల సంఖ్యను పెంచాలని గ్రంథాలయ అధికారి బాబుప్రసాద్‌కు సూచించారు. గ్రంథాలయ సెస్ బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. విద్యార్థినీ, విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని రమ కోరారు. నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

క్రీడా సామగ్రికి రూ. 40 వేల విరాళం

శెట్టూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాటకల్లు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం చంద్రమౌళి అధ్యక్షతన మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగింది. ఇందులో అఖిల భారత జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు కుబేర్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కనుక ప్రతి విద్యార్థి క్రీడల్లోనూ రాణించాలని చెప్పారు. తర్వాత కుబేర్ యాదవ్ విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాలలో క్రీడా పరికరాల కొనుగోలు కోసం రూ. 40 వేల చెక్కును అందించారు. సర్పంచ్ ఈరన్న, ఎస్ఎంసీ చైర్మన్ జయరాములు, వైస్‌సర్పంచ్ శివమూర్తి, గ్రామ పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్ ఫెస్ట్‌లో ప్రతిభ

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఇంజరింగ్ ప్రాజెక్టుల నమూనాల ప్రదర్శనలో గుంతకల్లు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శివకుమారి శనివారం తెలిపారు. మెకానికల్, ఎలక్ట్రికల్, బీవీటీ ఎలక్ట్రికల్ టెక్నాలజీ అనే మూడు ప్రాజెక్టులలో మా కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని అన్నారు.. ప్రతిభ కనబరచిన విద్యార్థులు విశాల్, సోహెల్, అశోక్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

కేజీబీవీ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శనివారం భూమిపూజ చేశారు. దోనిముక్కల రోడ్డులో గల కేజీబీవీకి ప్రహరీ నిర్మాణానికి రూ. 60 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో నిర్మాణానికి భూమిపూజ చేశారు. పూజ అనంతరం ఎమ్మెల్యే లాంచనంగా పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పాఠశాలలో బాలికలకు హాస్టల్ కూడా ఉన్నందున వారి భద్రత కోసం ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులను సమకూర్చిందని అన్నారు. జనసేన జిల్లా నాయకుడు వాసగిరి మణికంఠ, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, మహమ్మద్ ఖాజా, ఫజులు, ఫ్రూట్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయరాం


ఉరవకొండ జడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్


కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప హైస్కూల్లో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంత్ బాబు


గుంతకల్లులో రాజేంద్రప్రసాద్ ఉన్నతపాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

- ఉపాధ్యాయులకు వక్తల సూచన
- ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్సాహంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు వక్తలు సూచించారు. ఆ దిశగా తల్లిదండ్రులు సహకరించాలని అన్నారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని పండుగలా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు అధికారులు, ఇతర రంగాల ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలన్నారు. అలాగే తల్లింద్రులు ఇళ్ల వద్ద పిల్లలకు విలువలు, వ్యక్తిత్వాల గురించి వివరించాలన్నారు. వారిని ఉన్నతులుగా తీర్చిదిద్ది, మంచి భవిష్యత్తునందించేందు కు దోహద పడాలని సూచించారు. విద్యార్థులు కూడా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. చాలా పాఠశాలల్లో తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను వారి తల్లిదండ్రులకు అందజేశారు. సమావేశం సందర్భంగా పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమాల్లో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సీఐలు, ఎస్‌ఐలు, ఎస్ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.


కుందుర్పి పాఠశాలలో తాడులాగే ఆట ఆడుతున్న తల్లిదండ్రులు


పెద్దవడుగూరులో బహుమతుల ప్రదానం


బెళుగుప్ప మండలం ఎర్రగుడిలో తల్లిదండ్రులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

కమనీయం.. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

ఉరవకొండ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే అర్చకులు స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అలాగే సుబ్రహ్మణ్య, గాయత్రి, హవనం, పూర్ణాహుతిలను నిర్వహించారు. అనంతరం ఆలయప్రాంగణంలో శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి అభిజిత్ లగ్నంలో వేదమంత్రాల నడుమ కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేడుకలో పాల్గొని తీర్థ ప్రసాదాలు పొందారు. సాయంత్రం గ్రామోత్సవం, ఉయ్యాల సేవను నిర్వహించారు. అర్చకులు దివాకర్‌శర్మ, నాగరాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.


ఉరవకొండలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

రాయదుర్గం రూరల్: మండలంలో మల్లాపురం గ్రామంలో విప్రమల్లై నరసింహస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యం షష్ఠిని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో అర్చకులు సుబ్రహ్మణ్యంస్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలో ఉన్న నవనాగుల కట్ట వద్ద పంచామృతసేవ, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం గావించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బీటీ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవాలి

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు


భూమిపూజ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం టౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకుని, నైతిక విలువలు పెంపొందించుకోవాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని బీటీపీ లేఅవుట్‌లో అయోధ్య సీతారామాలయ నిర్మాణానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. శ్రీరాముడి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ భక్తి భావలు కలిగి ఉండాలన్నారు.అప్పుడే ప్రశాంతమైన జీవితం సాధ్యపడుతుందన్నారు. మంచి సమాజ నిర్మాణం కోసం కూడా నైతిక విలువలతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పొరాళ్ల శిల్ప, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు, ప్రముఖ వైద్యుడు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు హాజరు

కణేకల్లు: మండలంలోని పూలచెర్ల గ్రామంలో జరిగిన ఆంజనేయస్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలకు విప్ కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ఉదయమే వేదపండితులు హోమాలు, ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తకంగా విగ్రహాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. విప్ కాలవ హాజరై ఆంజనేయ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అంతకుమునుపు ఆయనకు ఆలయ నిర్వాహకులు ,స్థానిక టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాయకులు లాలెప్ప, ఆనంద్, ఆది, బసవరాజు, బుజ్జి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఆవిష్కరణ

పూలచెర్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని విప్ కాలవ శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన్న వాల్మీకి సంఘం నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

డ్రైనేజీల్లో పూడికతీత పనులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 37వ వార్డులో గల పలు కాలనీల్లో శనివారం మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీల్లో పూడిక తీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు చికెన్ జగన్, బసవరాజు, గోవిందరాజులు మాట్లాడుతూ.. కాలనీలో రైల్‌నగర్, సచివాలయం వద్ద, అంబేద్కర్ విగ్రహం వద్ద, సుంకులమ్మ గుడి సర్కిల్, మెయిన్‌రోడ్డులో, వాల్మీకి విగ్రహం వద్ద ఉన్న డ్రైనేజీల్లో చాలా ఏళ్ల నుంచి పూడిక తీత పనులు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం 20రోజుల నుంచి పనులను చేపడున్నట్లు వారు పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్టు

తాడిపత్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నెగ్రామం వద్ద ఉన్న పంప్‌హౌస్ సమీపంలో ఈనెల 3వ తేదీన పట్టణానికి చెందిన శ్రీనివాసులు, హాజీబాషా, అజయ్‌లపై హత్యాయత్నం చేసిన ఆరుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపామని రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మల్లెల వేణుగోపాల్ అలియాస్ పొట్టివేణు, పోరాటకాలనీకి చెందిన బిజిలి రామాంజనేయులు గతంలో స్నేహంగా ఉండేవారు. కొంతకాలం తర్వాత మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయి వర్గాలు ఏర్పాటుచేసుకున్నారు. వేణుగోపాల్ వర్గంలో ఉన్న మహమ్మద్ హుస్సేన్ కుమారుడు పుట్టిన సందర్భంగా ఈనెల 3న పట్టణంలోని వరాల తోట సమీపంలో పంప్‌హౌస్ వద్ద డిన్నర్ ఏర్పాటు చేశాడు. ఈ సమయంలో బిజిలి రామాంజనేయులు వర్గానికి చెందిన కొందరు ఈ ప్రాంతంలో తిరుగుతున్నారని భావించి వేణుతో పాటు ఆయన వర్గంలోని కొందరు దాడి చేయడానికి కట్టెలు, పిడిబాకులు సిద్ధం చేసుకొని బయలుదేరారు. ఇదే సమయంలో రామాంజనేయులు వర్గానికి చెందిన శ్రీనివాసులు, హాజీబాషా, అజయ్ ఎదురుపడ్డారు. దీంతో తమపై దాడిచేయడానికి వస్తున్నారని వేణుగోపాల్ వర్గం భావించి వారిపై ఎదురు దాడిచేశారు. డీఎస్పీ రామకృష్ణుడుకు వచ్చిన సమాచారం మేరకు పట్టణంలోని శివాలయంరోడ్డులో ఉన్న నిందితులు ఆరుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపామని సీఐ తెలిపారు. స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన మల్లెల వేణుగోపాల్, శివాలయంవీధికి చెందిన సురేష్, పాతకోటకు చెందిన షేక్ హుస్సేన్‌వలి, పోరాటకాలనీకి చెందిన గోపికృష్ణనాథ్, మెయిన్‌బజారుకు చెందిన షేక్ మహమ్మద్‌హుస్సేన్, హరిజనవాడకు చెందిన బండారు రామాంజనేయులును అరెస్ట్ చేశామని ఆయన చెప్పారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): న్యాక్, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రికల్, ప్లంబర్‌లో ఉచిత శిక్షణ కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు శనివారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గుత్తిరోడ్డులో గల పీడబ్ల్యూడీ కార్యాలయం ఆవరణలోని న్యాక్ స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే ఎన్‌సీవీటీ సర్టిఫికెట్ అందజేసి ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఈనెల 16లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7013858450, 8639576482 సంప్రదించాలని సూచించారు.


లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు: ఆర్డీఓ


మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లుటౌన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఆయన గర్భస్థ శుశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎవరూ కూడా లింగబేధం చూపించరాదన్నారు. మగపిల్లలు ఎక్కువ, ఆడపిల్లలు తక్కువ అనే భావన సరికాదన్నారు. అందరూ సమానమేనని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలు మగపిల్లలు వంశోద్ధారకులనే భావనను కలిగి ఉండడం సరికాదన్నారు. ల్యాబ్‌లలో, ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా వైద్యాధికారులు ప్రత్యేక కార్యచరణ ద్వారా పర్యవేక్షణ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి యుగంధర్, గైనకాలజిస్ట్ సుజాత, ఇతర వైద్యులు రామాంజినేయులు, హరిత, అరుణ, రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఆరోగ్యబోధకుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో వసంతబాబు అధ్యక్షతన గర్భస్థ శుశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై సమావేశం జరిగింది. ఇందులో ఆర్డీఓ మాట్లాడుతూ.. గర్భస్థ శుశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై గ్రామస్థాయిలో సమైక్య గ్రూపు సభ్యులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లల ప్రాముఖ్యతను వివరించాలన్నారు. మగ, ఆడ ఎక్కువ తక్కువ కాదని, సమానమేననే భావనను ప్రజల్లో తీసుకురావాలని సూచించారు. ల్యాబ్‌లలో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ పాఠశాలల వద్ద నుంచి లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్‌కుమార్ , కమిటీ సభ్యులు అమరా హిమబిందు, ఆరోగ్య, విద్యాబోధకులు లక్ష్మీనారాయణ, మాధవ తదితరులు పాల్గొన్నారు.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


పుష్పాలంకరణలో నేమకల్లు ఆంజనేయుడు

బొమ్మనహాళ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నిర్మల్యవిసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తరం నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి మహామంగహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండలంలో వడ్రవన్నూరు అంజనేయస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయన్నే స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, వెండి కవచధారణ చేసి తదితర పూజలు నిర్వహించారు.

ఘనంగా గ్రామోత్సవం..

యాడికి: మండలకేంద్రంలోని చింతవనంలో అంజనేయస్వామి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. తర్వాత స్వామివారి ఉత్సవమూర్తితో గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి మెయిన్‌బజారు, పాత పోలీస్‌స్టేషన్ వీధి, వైశ్యవీధి గుండా గ్రామోత్సవం చేశారు. గురుస్వామి నాగశేఖర్, పలువురు హనుమాన్ మలాధారులు పాల్గొన్నారు.

ఆలూరుకోనలో ప్రత్యేక పూజలు

తాడిపత్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరుకోనలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు వేకువజామునే స్వామి వారి, అమ్మవార్ల మూలవిరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

అన్నం సరిగా ఉండటం లేదని ఫిర్యాదు

తాడిపత్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గన్నెవారిపల్లికాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో మధ్యాహ్న భోజనం సరిగా ఉండడం లేదని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ప్రధానోపాధ్యాయుడు ఆరోగ్యస్వామికి ఫిర్యాదుచేశారు. అన్నం సరిగా ఉడకకుండానే విద్యార్థులకు ఎలా పెడుతున్నారని హెచ్‌ఎంను తల్లిదండ్రులు నిలదీశారు. ఈ అన్నం తిని మా పిల్లలు కడుపునొప్పితో బాధపడుతున్నారని వాపోయారు. మీ పిల్లలు అయితే ఇలాగే చేస్తారా అంటూ వారు మండిపడ్డారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయండి

కణేకల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో గత 16 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వంతో చర్చించాలని గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు రామానాయక్, వెంకటరమణ విప్ కాలవ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కణేకల్లు మండలానికి వచ్చిన కాలవను వారు కలిసి మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 750 మంది కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులర్ చేసేందుకు హామీ ఇచ్చారని, ఆ దిశగా చర్యలు తీసుకుని తమ జీవితాల్లో వెలుగులు నింపాలని వారు కోరారు.

వరి పొలంలో పంటకోత ప్రయోగం

కూడేరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరుట్లపల్లి గ్రామంలో గల పలు వరిపొలాల్లో శనివారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు పంట కోత ప్రయోగాలు చేపట్టారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంటకు వర్షాలు అధికంగా రావడంతోపాటు తెగుళ్ల సోకడంతో ఆశించిన స్థాయి లో దిగుబడి రాలేదన్నారు. ఎకరాలకు 40 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 20 క్వింటాళ్లు మాత్రమే వచ్చిందన్నారు. డీవైఎస్ఓ హరికృష్ణ, ఏఓ విజయ్ కుమార్, ఏఎస్ఓ ఆశా తదితరులు పాల్గొన్నారు.

మట్కాబీటర్ అరెస్టు

తాడిపత్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పప్పూరు రోడ్డులో ఓ మట్కాబీటర్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి లక్ష రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామని, అందులో ఆంజనేయస్వామిమాన్యంకు చెందిన ఒక మాట్కాబీటర్‌ను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ఇవ్వాలి

గుంతకల్లుటౌన్,డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి దౌల్తాపురం ప్రభాకర్ డిమాండ్ చేశాడు. దోనిముక్కల రోడ్డులోని టిడ్కో ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో చంద్రబాబు టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, అయితే జగన్ వచ్చాక పనులు జరగలేదని అన్నారు. ఇప్పటికైనా టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మౌలికసదుపాయాలు కల్పించి తక్షణమే లబ్ధిదారులకు ఇవ్వాలని సీఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, తరగరం రామాంజినేయులు, మహబుబ్‌భాషా, రామచంద్ర, షేక్ యూసుఫ్, దాసరిరవికుమార్, దీప్తి, తులసీ, తదితరులు పాల్గొన్నారు.

ఐదు కంప్యూటర్ల వితరణ

తాడిపత్రి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసపురంలో ఉన్న ట్రిబుల్‌ఎస్ ఆర్‌ఎం పాఠశాలకు రోటరీక్లబ్ వారు 5కంప్యూటర్లను వితరణ చేశారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చేతుల మీదుగా వాటిని అందించినట్లు అధ్యక్షుడు సుబ్రమణ్యం తెలిపారు. సెక్రటరీ రఫీ, సభ్యులు బాలసుబ్రమణ్యం, మద్దిలేటయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా మట్టిదిబ్బ

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

యల్లనూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పాతపేట సచివాలయ సమీపంలో రోడ్డుపై వేసిన మట్టి దిబ్బ ప్రమాదకరంగా ఉంది. పదిరోజులక్రితం టెలీ కమ్యూనికేషన్ వారు భూమి లోపల వైర్లు దెబ్బతినడంతో రోడ్డు పక్కన గుంత తవ్వి సరి చేశారు. అయితే పని పూర్తయిన తర్వాత గుంతను పూడ్చకోకుండా మట్టిని అలాగే రోడ్డుపై వదిలేసి వెళ్లారు. మట్టి దిబ్బ నడిరోడ్డు వరకు ఉంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ఎవరైనా అక్కడ ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాలకు గురికావాల్సిందే. అధికారులు చర్యలు తీసుకొని వెంటనే మట్టిని అక్కడి నుంచి తొలగించాలని గ్రామస్థులు , వాహనదారులు కోరుతున్నారు.


నడి రోడ్డు వరకు ఉన్న మట్టిదిబ్బ